సాక్షి
నల్లగొండ
మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024



గంజాయి విక్రేతల అరెస్ట్
ముగ్గురు గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్ట్ చేసి 4.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. - 8లో



పురుగుల మందు డబ్బాతో..
భూ సమస్య పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఓ మహిళ పురుగుల మందు డబ్బాతో పేట కలెక్టరేట్‌కు వచ్చింది. - 8లో



వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి
భువనగిరిలోని ఎస్సీ హాస్టల్ వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి డిమాండ్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

బీఈడీ పరీక్షల షెడ్యూల్ విడుదల

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ, బీపీఈడీ పరీక్షల షెడ్యూల్‌ను సోమవారం ఎంజీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి విడుదల చేశారు. బీఈడీ, బీపీఈడీ కోర్సుల 3వ సెమిస్టర్, స్పెషల్ ఎడ్యుకేషన్ 2వ సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ టైం టేబుల్‌ను విడుదల చేశారు. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పరీక్షల టైంటేబుల్ ఉన్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సిబ్బందికి వివరాలు ఇవ్వాలి

నల్లగొండ : విద్యుత్ వినియోగదారులు వారి ఇళ్ల వద్దకు వచ్చే విద్యుత్ సిబ్బందికి వారి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్ వివరాలు అందజేయాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ చంద్రమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ జ్యోతి పథకం అమలులో భాగంగా ఈ వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ వివరాలను విద్యుత్ సిబ్బంది గృహజ్యోతి పథకంలో పొందుపర్చుతారని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి

హాలియా : భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ అన్నారు. సోమవారం హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహించిన కెరీర్ గైడెన్స్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ పరిపాలన–ఓటింగ్, హక్కులు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడు రాజ్యాంగ చట్టాలను గౌరవించి పరిపాలన, విధులను నిజాయితీతో పాటించాలన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. రాజ్యాంగం కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పరంగి రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ విజయాదయ్య, ప్రోగ్రాం కన్వీనర్ వి.మాధవి తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

నల్లగొండ : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 960 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 890 మంది హాజరయ్యారు. 70 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన జనరల్ ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 821 మందికిగాను 798 మంది పరీక్షకు హాజరయ్యారు. 23 మంది గైర్హాజరయ్యారు.

పొంచిఉన్న ముప్పు



శిథిలావస్థలో ఉన్న మంచినీటి ట్యాంకు

అడవిదేవులపల్లి : మండల కేంద్రం ఉన్న మంచినీటి ట్యాంకు శిథిలావస్థలోకి చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ ట్యాంకు మంచినీటి అవసరాల కోసం 2007 నిర్మించారు. 17ఏళ్ల క్రితం నిర్మించిన నీటి ట్యాంకు ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఈ ట్యాంకుపై పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ప్రస్తుతం ఈ ట్యాంకు నుంచే గ్రామానికి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. శిథిలావస్థలో ఉండటంతో ఎప్పుడు కూలిపోతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

నీలగిరిపై కాంగ్రెస్ జెండా



చైర్మన్‌గా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన మంత్రి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ హరిచందన

మున్సిపల్ చైర్మన్‌గా బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

- నాలుగేళ్ల తరువాత హస్తగతమైన మున్సిపాలిటీ
- పట్టుదలతో సాధించుకున్న కాంగ్రెస్
- హ్యాట్రిక్ కౌన్సిలర్‌కు దక్కిన చైర్మన్ పదవి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : నీలగిరి మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగిరింది. గత బీఆర్ఎస్ పాలకవర్గాన్ని దింపిన హస్తం పార్టీ నాలుగేళ్ల తర్వాత మున్సిపాలిటీ పీఠాన్ని దక్కించుకుంది. మూడు సార్లు కౌన్సిలర్‌గా గెలిచి హ్యాట్రిక్ సాధించిన బుర్రి శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1999లో మొదటిసారి నల్లగొండ ఎమ్మెల్యేగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గెలిచిన తరువాత రెండు దశాబ్దాల పాటు నల్లగొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ చేతిలోనే ఉంది. 2020 జనవరి 28న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి దీటుగా కాంగ్రెస్ పార్టీ నుంచి 20 మంది కౌన్సిలర్లుగా గెలిచి అధికార పార్టీకి షాక్ ఇచ్చింది. అయినప్పటికీ ఎమ్మెల్సీలు, ఎక్స్ అఫీషియో సభ్యుల సహకారంతో బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ మున్సిపాలిటీ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. ఇటీవల రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గులాబీ పార్టీకి చెందిన కౌన్సిలర్లు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో కాంగ్రెస్ బలం పెరిగింది. పట్టుదలతో అవిశ్వాసం నెగ్గించుకుని చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ తిరిగి దక్కించుకుంది.

నాలుగేళ్ల తరువాత కాంగ్రెస్‌కు దక్కిన పీఠం

రెండు దశాబ్దాలపాటు నల్లగొండ మున్సిపాలిటీపై రెపరెపలాడిన హస్తం జెండా మళ్లీ నాలుగేళ్ల తరువాత ఎగిరింది. 48 మంది కౌన్సిలర్ స్థానాలకు గాను 2020 ఎన్నికల్లో కాంగ్రెస్ 20, బీఆర్ఎస్ 20, బీజేపీ 6, ఎంఐఎం ఒక స్థానంలో, ఇండిపెండెంట్ ఒకరు గెలిచారు. ఆ సమయంలో స్వతంత్ర అభ్యర్థిని పార్టీలో చేర్చుకోగా, ఎంఐఎం సభ్యురాలి మద్దతు, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్న ఐదుగురు ఎమ్మెల్సీలు, ఒక ఎమ్మెల్యే ఓట్లతో బీఆర్ఎస్ పార్టీ చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి అధికారంలోకి రావడం, స్థానికంగా ఎమ్మెల్యేగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గెలుపొంది మంత్రి అయ్యారు. ఈ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పార్టీ బలం 35కు పెరిగింది. దీంతో మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న మందడి సైదిరెడ్డిపై కాంగ్రెస్ పార్టీ పెట్టిన అవిశ్వాసం నెగ్గింది.

ఆదర్శ మున్సిపాలిటీగా మారుద్దాం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులంతా పట్టణాభివృద్ధి కోసం కలిసి పని చేయాలని, అవసరమైనన్ని నిధులు తెచ్చి నల్లగొండ మున్సిపాలిటీని ఆదర్శ పట్టణంగా చేసుకుందామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పని చేయాలన్నారు.

ప్రభుత్వ ఆమోదంతో సోమవారం నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

ఫ్లోర్ లీడర్‌కు చైర్మన్ పదవి..

2004లో క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చిన బుర్రి శ్రీనివాస్‌రెడ్డి నల్లగొండ మున్సిపాలిటీ రాజకీయాలపై పూర్తి పట్టు సాధించిన వ్యక్తిగా పేరుంది. మొదటిసారి 2005లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా గెలుపొందారు. ఆ తరువాత జరిగిన అన్ని ఎన్నికల్లోనూ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి విజయం సాధించారు. మూడుసార్లు భారీ మెజార్టీతో గెలిచి హ్యాట్రిక్ కౌన్సిలర్‌గా పేరు సంపాదించారు. గతంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌గా, ప్రస్తుతం ఫ్లోర్‌లీడర్‌గా ఉన్న ఆయనకే చైర్మన్ పీఠం అప్పగించింది. గతంలో ఆయన నల్లగొండ పట్టణంలోని రామాలయం చైర్మన్‌గా మూడుసార్లు పని చేశారు. అదే ఆలయానికి ఆయన సతీమణి చైతన్య రెండుసార్లు చైర్మన్‌గా పని చేశారు. నీలగిరి మున్సిపాలిటీ ఏర్పాటైన 74 ఏళ్ల చరిత్రలో 2020 ఎన్నికల్లో బుర్రి శ్రీనివాస్‌రెడ్డి – బుర్రి చైతన్య దంపతులు కౌన్సిలర్లుగా గెలుపొంది రికార్డు సృష్టించారు.

చైర్మన్ ఎన్నిక సాగిందిలా..

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 గంటలకు చైర్మన్ ఎన్నిక కోసం ఎన్నికల అధికారి, మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య సమావేశం నిర్వహించారు. దీనికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా హాజరయ్యారు. 11 గంటలకు కాంగ్రెస్ తరఫున చైర్మన్ అభ్యర్థిగా 32వ వార్డు కౌన్సిలర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పేరును 14 వార్డు కౌన్సిలర్ శంకరయ్య ప్రతిపాదించారు. ఇతర పార్టీల నుంచి చైర్మన్ అభ్యర్థిగా ఎవరి పేరును ప్రతిపాదించలేదు. దీంతో 11.30 గంటలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మున్సిపల్ చెర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం బుర్రి శ్రీనివాస్‌రెడ్డి చేత చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డితో పాటు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు మందడి సైదిరెడ్డి, శ్రీనివాస్, భవాని చైర్మన్ ఎన్నిక సమావేశానికి గైర్హాజరయ్యారు. సమావేశంలో కలెక్టర్ హరిచందన, మున్సిపల్ కమిషనర్ రవి, ఎస్ఈ కందుకూరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ పాల్గొన్నారు.



చైర్మన్ ఎన్నిక సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

బాధ్యతతో పనిచేయాలి



ప్రత్యేకాధికారుల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- పంచాయతీ ప్రత్యేకాధికారులకు శిక్షణ

నల్లగొండ: గ్రామ పంచాయతీలకు కేటాయించిన ప్రత్యేకాధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని ఆయా గ్రామ పంచాయతీలకు కేటాయించిన ప్రత్యేకాధికారులకు నల్లగొండ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే వరకు ప్రత్యేకాధికారులుగా అదనపు బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలకు కేటాయించిన నిధుల నుంచి తాగునీటి పరిష్కారానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం కలెక్టర్ హరిచందన దాసరి మాట్లాడుతూ.. ఫిబ్రవరి 7 నుంచి 14వ తేదీ వరకు గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకాధికారులు తమ విధుల పట్ల అవగాహన కలిగి ఉండి గ్రామ పంచాయతీల్లో నిధుల లభ్యత, ఎంత ఖర్చు పెట్టాలో పరిశీలించాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇంటి పన్నులు, లేఅవుట్ అనుమతులు, నల్లా బిల్లులు సక్రమంగా వసూలు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీపీఆర్‌ఓపై మంత్రి సీరియస్

నల్లగొండ జిల్లా ప్రజా సంబంధాల అధికారి (డీపీఆర్‌ఓ) శ్రీనివాస్‌పై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సీరియస్ అయ్యారు. సోమవారం నల్లగొండలో మంత్రి విలేకరుల సమావేశానికి విలేకరులు సమయానికి హాజరు కాలేదు. ముందే విలేకరులకు సమాచారం ఇచ్చి ఎందుకు పిలిపించలేక పోయారంటూ డీపీఆర్‌ఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్‌తో మాట్లాడి నల్లగొండకు కొత్త డీపీఆర్‌ఓను వేయించాలని అక్కడే ఉన్న పీఏతో మంత్రి చెప్పారు.

బాధితులకు భరోసా కల్పించాలి

నల్లగొండ క్రైం : ఫిర్యాదులపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధితులకు భరోసా కల్పించాలని ఎస్పీ చందనాదీప్తి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌డే సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఆమె ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ఎక్కువగా కుటుంబ తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీలపై ఫిర్యాదులు అందాయని తెలిపారు. వాటిపై సమగ్ర దర్యాప్తు చేసి తగిన నివేదిక అందించాలని, ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఆదేశించారు.



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడుతున్న ఎస్పీ చందనాదీప్తి

అనుమతి లేకుండా సభలు పెట్టొద్దు

ఎలాంటి అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించ వద్దని ఎస్పీ చందనాదీప్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ 1861 అమల్లో ఉంటుందని తెలిపారు. అనుమతి లేకుండా ఎలాంటి సభలు పెట్టినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నది తీరంలో కట్టడాల కూల్చివేత

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ పరిధిలోగల హిల్‌కాలనీలో కొత్త లాంచీస్టేషన్ వెంట జలాశయ తీరం సమీపంలో నిర్మించిన ఇంటిని మున్సిపాలిటీ అధికారులు సోమవారం తెల్లవారుజామున కూల్చివేశారు. ఆ ప్రాంతంలో అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలన్నింటినీ కూల్చివేస్తామని మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్ వీరారెడ్డి తెలిపారు. టీఎస్–బీపాస్ మున్సిపాలిటీ చట్టం –2019 ప్రకారం అనుమతి లేకుండా నిర్మించిన ఇంటిని కూల్చివేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దవూర, తిరుమలగిరి(సాగర్), విజయపురినార్త్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐలు, సాగర్ సర్కిల్ సీఐ, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఇంటిని కూల్చివేస్తున్న జేసీబీ

నోటీసు ఇవ్వకుండా కూల్చివేశారు

ఈ స్థలం 10 సంవత్సరాలుగా మా ఆధీనంలో ఉంది. ప్రభుత్వం ఇచ్చిన 58, 59జీఓ ప్రకారం దరఖాస్తు కూడా చేశాం. ఇంటిని పూర్తిగా నిర్మించుకుని రెండు రోజుల్లో గృహప్రవేశం చేసేందుకు సిద్ధమయ్యాం. మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా 150 మంది పోలీసులు, మున్సిపాలిటీ సిబ్బంది మాపై దాడి చేసి ఇంటిని పూర్తిగా కూలగొట్టారు.

– కార్తీక్, ఇంటి యజమాని

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

నల్లగొండ : ప్రజావాణి కార్యక్రమంలో బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి తగు న్యాయం చేయాలని కలెక్టర్ హరిచందన అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై వచ్చిన బాధితుల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. కొందరు దివ్యాంగులు దరఖాస్తు తీసుకుని కలెక్టరేట్‌కురాగా ఆమె వారి వద్దకు వెళ్లి దరఖాస్తులను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుల వద్దకు వెళ్లి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరిచందన

సీఈఓ నియామకానికి ఆమోదం

నల్లగొండ అగ్రికల్చర్ : డీసీసీబీ సీఈఓగా టెస్కాబ్ ఎంపిక చేసిన శంకర్‌రావు నియామకానికి డీసీసీబీ పాలకవర్గం ఆమోదం తెలిపింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) జనరల్ బాడీ సమావేశాన్ని సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ఇటీవల బ్యాంకు సీఈఓ కె.మదన్‌మోహన్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో బ్యాంకు సీఈఓ నియామకం కోసం బ్యాంకు పాలకవర్గం నాబార్డ్‌కు లేఖను రాసింది. రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ శంకర్‌రావును టెస్కాబ్ సీఈఓగా ఎంపిక చేసింది. బ్యాంకు పాలకవర్గ సమావేశంలో ఆయన నియామకాన్ని ఆమోదిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, ఇన్‌చార్జి సీఈఓ వసంతకుమార్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాల ఫలితాలు విడుదల

నల్లగొండ రూరల్ : పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) మొదటి సెమిస్టర్ 2023–24 పరీక్షల ఫలితాలను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఘనశ్యాం, సీఓఈ నరేష్ విడుదల చేశారు. 2023 డిసెంబర్‌లో నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదల చేసి కళాశాల వెబ్‌సైట్‌లో పెట్టినట్లు తెలిపారు. మొదటి సెమిస్టర్‌కు మొత్తం 766 మంది విద్యార్థులు హాజరుకాగా 267 మంది ఉత్తీర్ణులయ్యాని, 499 మంది ప్రమోట్ అయ్యారని తెలిపారు. మొత్తం 34.86 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. రీవ్యాల్యుయేషన్ తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంజీయూ సీఓఈ ఉపేందర్‌రెడ్డి, అధ్యాపకులు భాస్కర్ రెడ్డి, దేవవాణి, రాజారాం, సునీత, దహీద్, అలివేలు పాల్గొన్నారు.

చెర్వుగట్టులో మెరుగైన వసతులు కల్పించాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం
- ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు. ఈనెల 14వ తేదీ నుంచి 21వ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం నల్లగొండ ఆర్డీఓ రవి అధ్యక్షతన దేవాలయ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో సమన్వయసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు ఈ ఏడాది లక్ష మంది భక్తులు విచ్చేసే అవకాశం ఉందని.. అందుకు తగిన విధంగా అధికారులకు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళకు ఉచిత ప్రయాణ సదుపాయం ఉన్నందున ఆలయం ఎద్దకు ఎక్కువ బస్సులను తిప్పాలని సూచించారు. ఆర్డీఓ రవి, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో దేవాలయ శాఖ సహాయ కమిషనర్ మహేందర్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నర్సింహ, ఎంపీడీఓ యాదగిరి, తహసీల్దార్ పద్మ, సీఐ మహేష్, ఈఓ నవీన్‌కుమార్, ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, నాయకులు సట్టు సత్తయ్య, పున్నంరాజు యాదగిరి, కృష్ణ, వరాల రమేష్, రేగట్టె రాజశేఖర్ రెడ్డి, నర్సిరెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

మీ వాళ్లే.. మీ ప్రభుత్వాన్ని కూల్చేస్తారు

- రాహుల్‌ది జోడో యాత్ర కాదు.. చోడో యాత్ర
- మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి





బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి

మిర్యాలగూడ : కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆ పార్టీ నాయకులే కూల్చేస్తారని.. ఆ దిశగా ఇటీవల జరిగిన మంత్రి మండలిలో తుమ్మల నాగేశ్వర్‌రావు సీఎం రేవంత్‌రెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకుందని మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి భాష మార్చుకోవాలని.. లేకుంటే ప్రజలు సాగనంపడం ఖాయమన్నారు. యాదాద్రి పవర్‌ప్లాంట్ పనుల నిర్మాణాలను ఆపుతానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారని, దమ్ముంటే ఆపి చూడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తామెందుకు కూలుస్తామని, ఆ అవసరం కూడా తమకు లేదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజలే ప్రభుత్వాన్ని కూలుస్తారని అన్నారు.

సాగర్ డ్యాంను స్వాధీనం చేసుకోవాలి

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు కాపాడుకోలేక కేంద్రం చేతుల్లో పెట్టారని, ఆ తప్పును కప్పి పుచ్చుకునేందుకు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలపై ఏ మాత్రం ప్రేమ, చిత్తశుద్ధి ఉన్నా మంగళవారం (నేడు)సాయంత్రానికి సాగర్ డ్యాంను స్వాధీనం చేసుకోవాలన్నారు. త్వరలో కేసీఆర్ ప్రజల మధ్యకు వచ్చి సాగర్ ప్రాజెక్టును, తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని కాపాడుతారన్నారు. 2014 తరువాత దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ రెండుసార్లు అధికారంలోకి వచ్చిన దాఖలాలు లేవన్నారు. ఒకసారి కాంగ్రెస్ పాలనను చూద్దామని ఓట్లు వేశారే తప్పా కేసీఆర్‌పై వ్యతిరేకతతో కాదన్నారు. కార్యకర్తలు అధైర్యపడకుండా రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మాట్లాడుతూ తండాలను గ్రామపంచాయతీలుగా చేసి మౌలిక వసతులను కల్పించి గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ కృషి చేశారన్నారు. అనంతరం పదవీకాలం ముగిసిన సర్పంచ్‌లకు సన్మానం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పన విజయసింహారెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, నాయకులు గుత్తా అమిత్‌రెడ్డి, అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నల్లమోతు సిద్దార్థ, మోసిన్‌అలీ, దుర్గంపూడి నారాయణరెడ్డి, పాలుట్ల బాబయ్య, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, మట్టపల్లి సైదులుయాదవ్, కూరాకుల చినరామయ్య ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

సాగు నీటి ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పజెప్పి రైతులకు అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో పట్టణంలోని నందిపాడు జంక్షన్ వద్ద కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డిని దగ్ధం చేశారు. కార్యక్రమంలో అన్నభీమోజు నాగార్జునచారి, ఎండీ.షోయబ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

బాలికల ఉన్నత పాఠశాలలో విచారణ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కళారాణి

నడిగూడెం : నడిగూడెం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో అసభ్యకరంగా మాట్లాడుతున్నారని అదే పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు ఇటీవల డీఈఓ అశోక్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లా విద్యాధికారి కార్యాలయం అధికారిణి కళారాణి సోమవారం పాఠశాలలో విచారణ జరిపారు. నివేదికను విద్యాధికారికి ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

బీబీనగర్: లారీ ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండలం కంచెనపల్లికి గ్రామానికి చెందిన సాదు చంద్రశేఖర్‌రెడ్డి(23) హైదరాబాద్‌లోని వాషింగ్ సెంటర్‌ను నడుపుతున్నాడు. కాగా ఆదివారం రాత్రి బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా గూడూరు టోల్‌ప్లాజా సమీపంలోని రాఘవేందర్ హోటల్ వద్దకు రాగానే వెనుక నుంచి వస్తున్న ఓ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలు కావడంలో అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సోమవారం మృతుడి సోదరుడు సాదు విక్రమ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగేందర్ తెలిపారు.

వీడని హత్య కేసు మిస్టరీ

కేతేపల్లి: కేతేపల్లి మండలంలోని ఇప్పలగూడెం గ్రామంలో వ్యవసాయ కూలీ వంటల సైదులు హత్యకు గురై మూడు రోజులు కావస్తున్నా కేసు మిస్టరీ ఇంకా వీడలేదు. ఈనెల 3న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సైదులును దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. గ్రామంలో ఓ వివాహితతో సైదులు వివాహేతర సంబంధం పెట్టుకున్న కారణంగానే ఈ హత్య జరిగిందనే కోణంలోనే పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. హత్య జరిగిన మరుసటి రోజే అనుమానిత మహిళతో పాటు ఆమెకు సంబంధించిన మరో కుటుంబ సభ్యుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్య ప్రదేశంలో విచారణ జరుపుతున్నట్లు సమాచారం. మరో నలుగురు పరారీలో ఉన్నారని, వారి కోసం పోలీసులు గాలిస్తున్నట్లుగా స్థానికులు చర్చించుకుంటున్నారు. దీంతో పాటు ఈ హత్యలో అనుమానిత కుటుంబ సభ్యులే కాకుండా ఇతరుల ప్రమేయం ఏమైనా ఉన్నదా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్

- 4.5 కిలోల గంజాయి, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- నిందితుల వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాహుల్‌హెగ్డే

మునగాల(కోదాడ): ముగ్గురు గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 4.5కిలోల గంజాయితో పాటు రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే నిందితుల వివరాలు వెల్లడించారు. సూర్యాపేట మండలం కేసారం గ్రామానికి చెందిన మెంతబోయిన గణేష్, చివ్వెంల మండల కేంద్రానికి చెందిన జాకటి కార్తీక్, మోతె మండలం రావిపహాడ్‌కు చెందిన వంటమాస్టారు ఎలుగు మహేష్ ముఠాగా ఏర్పడి కొంతకాలంగా గంజాయిని విక్రయిస్తున్నారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒడిశా సరిహద్దులోని అంబాద గ్రామంలో కిలో రూ.5వేలకు గంజాయిని కొనుగోలు చేసి సూర్యాపేట పరిసర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. అంబాద గ్రామం నుంచి 4.5 కిలోల గంజాయిని కొనుగోలు చేసిన ముఠా సభ్యులు సూర్యాపేటకు బైక్‌లపై బయలుదేరారు. ఆదివారం ఖమ్మం జిల్లా మామిళ్లగూడెం వద్ద పోలీసు చెక్‌పోస్టు ఉండడంతో కోదాడ మీదుగా సూర్యాపేటకు వెళ్తున్నారు. మార్గమధ్యలో మునగాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మొద్దులచెరువు స్టేజీ వద్ద విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా గంజాయి రవాణా విషయం వెలుగుచూసింది. నిందితులపై కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్పీ వివరించారు.



మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

గంజాయి రవాణాపై నిఘా పెంచాం

జిల్లాలో గంజాయి రవాణా, వినియోగించే వారిపై నిఘా పెంచామని ఎస్పీ తెలిపారు. గంజాయి సరఫరా చేసే వారిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. గంజాయి నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గంజాయి రవాణా చేస్తున్న నిందితులను అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ వీరరాఘవులు, మునగాల, మోతె పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐలు పి.లోకేష్, వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఐలు మల్సూర్, నాగేశ్వరరావు, సిబ్బంది సుధీర్‌కుమార్, రవికుమార్, వెంకటేశ్వర్లు, రాంబాబు, పుల్లారావు, బాలు, ఈశ్వర్‌లను ఎస్పీ అభినందించారు. సమావేశంలో కోదాడ డీఎస్పీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రక్షణ కల్పించేందుకే కార్డెన్ సెర్చ్

నేరేడుచర్ల : అసాంఘిక శక్తుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకే కార్డెన్ సెర్చ్ (నిర్బంధ తనిఖీలు) నిర్వహిస్తున్నట్లు హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి పేర్కొన్నారు. నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న గ్రామంలో సోమవారం తెల్లవారుమున పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని పలు ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలు, టాటా ఏస్ వాహనాన్ని సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో సంఘ విద్రోహశక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాడుతూ ప్రజా జీవనాన్ని ఇబ్బందులను గురి చేసే వారిని గుర్తించేందుకే తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పద శక్తులు సంచరిస్తే పోలీసులు, 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో ఐదుగురు ఎస్‌ఐలు, ఇద్దరు ఏఎస్‌ఐలు, ఏడుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 20 మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.



పెంచికల్‌దిన్నలో మాట్లాడుతున్న హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి

యువకుడు అదృశ్యం

గుర్రంపోడు : ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. గుర్రంపోడుకు చెందిన షేక్ షరీఫ్(25) ఇటీవల తల్లిదండ్రులతో కలసి జాన్‌పహాడ్ దర్గాకు వెళ్లాడు. షరీఫ్‌కు మతిస్థిమితం లేదు. దర్గా వద్ద తప్పిపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. తెలుపుకలర్, 5.3 అంగులాల ఎత్తు ఉంటాడని, కనిపిస్తే 8008785964నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోదాడ రూరల్ : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను రూరల్ పోలీసులు సోమవారం పట్టుకొని కేసు నమోదు చేశారు. కోదాడ మండలంలోని మంగళితండా వద్ద గల పాలేరు వాగు నుంచి కోదాడకు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా చిమిర్యాల క్రాస్‌రోడ్ వద్ద పట్టుకొని డ్రైవర్, ఓనర్ అయిన మార్కపూడి కమలాకర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కారు డ్రైవర్‌కు ఆరునెలల జైలు శిక్ష

కట్టంగూర్ : ఇద్దరి మృతికి కారణమైన కారు డ్రైవర్‌కు సోమవారం నకిరేకల్ కోర్టు మేజిస్ట్రేట్ షేక్ ఆరిఫ్ ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించినట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కట్టంగూర్ మండలంలోని పరడ గ్రామానికి చెందిన మాగి భిక్షం, కోనేటి యాద య్య, సుంకరబోయిన వెంకన్నల 2015వ సంవత్సరం మే 20వ తేదీన బైక్‌పై నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలోని పామనగుండ్ల సబ్‌స్టేషన్ వద్దకు రాగానే హైదరాబాదు నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు డ్రైవర్ వడ్లపల్లి చిదానంద అతివేగంగా అజాగ్రత్తగా నడిపి ద్విచక్ర వాహనాన్ని వెనుకనుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భిక్షం, యాదయ్య అక్కడికక్కడే మృతిచెందగా వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు భిక్షం కుమారుడు ప్రకాశ్ ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్ కేసు నమోదు చేసి చార్జిషీట్ ఫైల్ చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నకిరేకల్ మెజిస్ట్రేట్ సోమవారం కారు డ్రైవర్‌కు జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

ఒకరికి తీవ్రగాయాలు

ఆలేరురూరల్ : ఆలేరు పట్టణ కేంద్రంలోని కొలనుపాక రోడ్డులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. జనగాం జిల్లా లింగాలఘనపురం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎం.శ్రీకాంత్ బైక్‌పై కొలనుపాక వెళ్లి పని ముగించుకొని తిరిగి ఆలేరు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో తెలంగాణ డాబా సమీపంలో ఎదురుగా వస్తున్న తుఫాన్ వాహనం ఢీకొనడంతో శ్రీకాంత్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వెంకటశ్రీను తెలిపారు.

లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు, జరిమానా

చివ్వెంల(సూర్యాపేట) : ఒకరి మృతికి కారణమైన లారీడ్రైవర్‌కు కింది కోర్టు ఇచ్చిన తీర్పును అమలు పరుస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ సోమవారం తీర్పు వెల్లడించారు. కోదాడ పట్టణానికి చెందిన మాలోతు ఉపేందర్ 2016 సంవత్సరం ఆగస్టులో తన మోపెడ్‌పై కటింగ్ షాపునకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో కోదాడ నుంచి మిర్యాలగూడ వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో ఉపేందర్ అక్కడిక్కడే మృతిచెందాడు. దీంతో విషయం తెలుసుకున్న మృతుడి తండ్రి నాగేశ్వర్‌రావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన అప్పటి ఎస్‌ఐ కేసు నమోదు చేసి జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామానికి చెందిన లారీడ్రైవర్ అద్దంకి చిన్నబాబును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచాడు. పలువురు సాక్షులను విచారించిన కోదాడ ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు, రూ.వెయ్యి జరిమానా విధించారు. దానిని సవాల్ చేస్తూ నిందితుడు జిల్లా కోర్టులో అప్పీల్ చేసుకోగా, సాక్షులను విచారించిన న్యాయమూర్తి పీపీ కొవవల్లి లింగయ్య వాదలనతో ఏకిభవిస్తూ ఆ తీర్పునే అమలు చేశారు.

18మందిపై కేసు

భువనగిరి క్రైం: ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని భువనగిరిలో ఆదివారం నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న 18మందిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. వీరిలో బీఎస్పీ, బీఆర్‌ఎస్, బీజేపీ, ఐద్వా నాయకులు భట్టు రామచంద్రయ్య, ఏవీ కిరణ్‌కుమార్, రత్నపురం బాలరాజు, అనురాధ, అయోధ్యాయాదవ్, ఇమ్రాన్‌తో పాటు 12మంది ఉన్నారని ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

పురుగుల మందు డబ్బాతో కలెక్టరేట్‌కు..

- మహిళను కార్యాలయం గేటు వద్ద అడ్డుకున్న పోలీసులు
- భూ సమస్య పరిష్కారం కావడంలేదని ఆవేదన

దురాజ్‌పల్లి(సూర్యాపేట) : భూ సమస్యను పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఓ మహిళ సోమవారం పురుగుల మందు డబ్బాతో సూర్యాపేట కలెక్టరేట్‌కు వచ్చింది. గేటు వద్దనే పోలీసులు సదరు మహిళను గుర్తించి పురుగుల మందు డబ్బాను తీసుకోవడంతో ప్రమాదం తప్పింది. చివ్వెంల మండల కేంద్రానికి చెందిన సుంకిరెడ్డి సుశీలమ్మకు గ్రామంలోని 17, 19, 21 సర్వే నంబర్లలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 50 సంవత్సరాలుగా సుశీలమ్మ కుటుంబ సభ్యులే భూమిని సాగు చేసుకుంటున్నారు. 2012వ సంవత్సరంలో మూడు ఎకరాల భూమి సుశీలమ్మ పేరిట రిజిస్ట్రేషన్ కాగా నేటికీ పట్టాదారు పాస్‌పుస్తకం అందలేదు. తన తల్లి పేరిట భూమిని పట్టా చేసి పాస్ పుస్తకం అందించాలని కొన్ని నెలలుగా సుశీలమ్మ కూతురు చివ్వెంల మండలం గుంపుల గ్రామానికి చెందిన నాతాల పూలమ్మ కోరుతోంది. ఈ విషయంపై గతంలో కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయగా భూమిని పరిశీలించి పట్టా చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించినట్లు బాధితురాలు పేర్కొంది. అయినా మండల రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని, అందుకే ఆత్మహత్య చేసుకునేందుకు పురుగుల మందు తెచ్చుకున్నట్లు పూలమ్మ చెప్పింది. దీనిపై అదనపు కలెక్టర్ స్పందిస్తూ భూ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



పురుగుల మందు డబ్బా తీసుకున్న హోంగార్డు, చిత్రంలో బాధితురాలు పూలమ్మ

కుటుంబ సభ్యులు మందలించారని..

- ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

వలిగొండ : కుటుంబ సభ్యులు మందలించారని ఉరేసుకుని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. వలిగొండ మండల పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండలం వెల్వర్తి గ్రామానికి చెందిన పసల సతీష్‌కుమార్ (24) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా సతీష్‌కుమార్ మద్యానికి బానిసగా మారాడు. ఈ విషయంలో సతీష్‌కుమార్‌ను కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి సతీష్‌కుమార్ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. సోమవారం ఉదయం తండ్రి బాలస్వామి వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా సతీష్‌కుమార్ చెట్టుకు వెలాడుతూ విగతజీవుడిగా కనిపించాడు. సమాచారం మేరకు గ్రామస్తులు వచ్చి మృతదేహాన్ని కిందకు దించారు. పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య భాగ్యరేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు.



సతీష్‌కుమార్ (ఫైల్)

బైక్‌తో సహా సజీవదహనం

- పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్న పోలీసులు
- మృతుడు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ వాసి

భువనగిరి క్రైం : ఓ వ్యక్తి బైక్‌తో సహా సజీవదహనమయ్యాడు. యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన సూర నాగరాజు(39) హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. నాగరాజు కొన్నేళ్లుగా మధుమేహంతో పాటు ఇతర వ్యాధులతో బాధపడుతున్నాడు. నాగారాజు సోమవారం తెల్లవారుజామున బైక్‌పై భువనగిరి మండలం అనంతారం గ్రామలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్దకు చేరుకున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. అనంతరం బైక్‌తో పాటు వ్యక్తి తగలబడిపోతుండడాన్ని స్థానికులు గుర్తించి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అప్పటికే నాగరాజు విగతజీవుడిగా మారాడు. బైక్ నంబర్ ఆధారంగా మృతుడు నాగరాజుగా గుర్తించారు. బైక్‌ను తగులబెట్టి ఆపై తానూ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. మృతుడి బంధువు సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.



నాగరాజు (ఫైల్)

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

కోదాడరూరల్ : పోగొట్టుకున్న పర్సును బాధితుడికి అందజేసి నిజాయితీ చాటుకున్నాడు.. ఓ రిటైర్డ్ టీచర్. కోదాడ పట్టణానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం శెట్టి వెంకటేశ్వర్లుకు రోశమ్మగారి వీధిలో ఓ పర్సు దొరికింది. ఆ పర్సును డీఎస్పీ కార్యాలయంలో అందజేసి పరిశీలించగా రూ.3,520 నగదుతో పాటు ఆధార్, పాన్ కార్డు పలు విలువైన పత్రాలు ఉన్నట్లు గుర్తించారు. పర్సులో ఉన్న అడ్రస్ ఆధారంగా ఒడిశా నుంచి జీవనోపాధికి వచ్చిన షేక్.ఆరీఫ్‌దిగా గుర్తించారు. అతన్ని స్టేషన్‌కు పిలిపించి డీఎస్పీ ప్రకాష్ చేతుల మీదగా అందజేశారు. దీంతో నిజాయితీ చాటుకున్న వెంకటేశ్వర్లును డీఎస్పీతో పాటు పలువురు అభినందించారు.



బాధితుడికి పర్సు అందజేస్తున్న డీఎస్పీ ప్రకాష్, రిటైర్డ్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు

ప్రభుత్వ మద్దతుకు మించి..

- కంది, వేరుశనగ పంటలకు రికార్డు స్థాయిలో ధరలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

తిరుమలగిరి (తుంగతుర్తి): ప్రస్తుత సీజన్‌లో వేరుశనగ, కంది పంటలకు మద్దతుకు మించి ధరలు పలుకుతున్నాయి.తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు పదిహేను రోజులుగా వివిధ ప్రాంతాల నుంచి వేరుశనగ కాయ వస్తుంది. ఇప్పటి వరకు 2,434 క్వింటాళ్ల కాయ మార్కెట్‌కు వచ్చింది. అయితే వేరుశనగ క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.6,377 ఉండగా గరిష్టంగా క్వింటాకు రూ.8,630, కనిష్టంగా రూ.6వేలకుపైగా ధర పలుకుతోంది.మార్కెట్‌కు వేరుశనగ కాయ భారీగా రావడంతో ప్రజలతోపాటు వ్యాపారులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. దీంతో వేరుశనగ కాయకు మంచి డిమాండ్ ఏర్పడి రోజురోజుకూ ధర మరింత పెరుగుతూనే ఉంది. గతంలో కంటే వేరుశనగ కాయ సాగు తగ్గినా మద్దతు ధర కంటే అధిక ధరలు పలుకుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ రాశులు

కందులకు రికార్డు ధర

కంది సాగు చేసే రైతులకు కూడా ఈసారి మంచి ధరలే వస్తున్నాయి. గత నెల రోజులుగా వ్యవసాయ మార్కెట్‌కు భారీగా కందులు వస్తున్నాయి. ప్రస్తుతం కందులకు మద్దతు ధర క్వింటాళ్‌కు రూ.7 వేలు తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో ప్రతిరోజు మద్దతు ధర కంటే అధికంగానే ధరలు వస్తున్నాయి. శుక్రవారం క్వింటాళ్‌కు గరిష్టంగా రూ.10217 ధర పలికింది. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ స్థాయిలో ధర రాలేదని రైతులు, వ్యాపారులు తెలుపుతున్నారు. వ్యవసాయ మార్కెట్‌కు ఇప్పటి వరకు 4971 క్వింటాళ్ల కందులు వచ్చాయి. గరిష్టంగా క్వింటాళ్‌కు రూ.10217, కనిష్టంగా రూ.8160 ధరలు పలికాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కంది పప్పు కేజీ రూ.150 కంటే అధికంగా ఉండటంతో ఈసారి కందులకు గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు ధరలు చోటు చేసుకుంటున్నాయి.కందులకు ప్రభుత్వ మద్దతు ధర కంటే అధిక ధరలు వస్తుండటంతో మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదు.



తిరుమలగిరి మార్కెట్‌లో కందుల రాశులు

మంచి ధర పలికింది



తిరుమలగిరి మార్కెట్‌కు 10 క్వింటాళ్ల కందులు తీసుకొచ్చా. క్వింటాళ్‌కు రూ.10217 ధర వచ్చింది. గతంలో ఎన్నడు కూడ కందులకు ఈ ధర రాలేదు. చాలా సంతోషంగా ఉంది.

– గుగులోతు భద్రు, వెంపటి, తుంగతుర్తి మండలం

ఇబ్బందులు పడుతున్నాం

గతంలో వేరుశనగ పంటను ఎక్కువ విస్తీర్ణంలో వేసేవాళ్లం. కొన్నేళ్లుగా కోతుల బెడద అధికంగా ఉండటంతో వేరుశనగ పంట వేయలేక పోతున్నాము. ఈసారి రెండు ఎకరాలలో వేరుశనగ పంట వేశాను. ఉదయం నుంచి రాత్రి వరకు కుటుంబ సభ్యులమందరమూ కాపలా ఉన్నాము. మార్కెట్‌కు వేరుశనగ తీసుకొస్తే క్వింటాళ్‌కు రూ.7900 ధర వచ్చింది.

– వెంకటయ్య, వెలిశాల, తిరుమలగిరి మండలం

రూ.80 కిలో చొప్పన కొనుగోలు చేశారు



మార్కెట్‌లో వేరుశనగ కాయను కేజీకి రూ.80కి చొప్పున కొనుగోలు చేశారు. ఇంటి అవసరాలకు ప్రతి సంవత్సరం మార్కెట్‌లోనే 30కేజీల వేరుశనగను కొనుగోలు చేస్తారు. మార్కెట్‌కు వచ్చిన వేరుశనగ కాయ నాణ్యతగా ఉంటుంది.

– సాయికుమార్, తిరుమలగిరి

ఎస్సీ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

- మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- యాదాద్రి భువనగిరి జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి



విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న గదిని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి

భువనగిరి : భువనగిరి పట్టణంలోని ఎస్సీ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ చైర్మన్ సందీప్‌రెడ్డి డిమాండ్ చేశారు. భువనగిరి పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో ఈ నెల 3వ తేదీన ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న గదిని సోమవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి పరిశీలించి మాట్లాడారు. వార్డెన్ సంఘటన జరిగిన సమయంలో హాస్టల్‌లో లేకపోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు. విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న సమయంలో బెడ్ పక్కనే ఉన్నా సపోర్ట్ తీసుకోకపోవడం అనుమానంగా ఉందన్నారు. పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన తర్వాత విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. అనంతరం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ హాస్టల్‌లో జరిగిన సంఘటనలో వార్డెన్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. హాస్టల్ గదుల్లో అశ్లీల వ్యాఖ్యలు కనిపించడం, వార్డెన్ పర్యవేక్షణ చేయడం లేదని స్పష్టంగా తెలుస్తోందన్నారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలన్నారు. అంతకు ముందు ఎస్సీ వసతి గృహాల డివిజనల్ ఆఫీసర్ వసంతతో పాటు సిబ్బందితో సంఘటనలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట జెడ్పీటీసీ బీరు మల్లయ్య, బీఆర్‌ఎస్ నాయకులు ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, పాండు పాల్గొన్నారు.